Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 203 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 21 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# భక్తుల విశ్వాసం..నమ్మకానికి భరోసా

## - తిరుమలలోనే ప్రసాదాల కల్తీని గుర్తించే అత్యాధునిక స్టేట్ ఫుడ్ ల్యాబ్ సిద్ధం - దేశంలోని పుణ్యక్షేత్రాల్లో ఏర్పాటు కావడం ఇదే తొలిసారి - నేడు సీఎం చంద్రబాబుచే ప్రారంభం : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి






ఫుడ్ ల్యాబొరేటరీలోని ఆత్యాధునిక ఎక్విప్మెంట్స్

**తిరుమల, (రాజధాని వార్తలు):** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రారంభించనున్నారు. శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యత, స్వచ్ఛత, నెయ్యి, నూనె, పాలు, ఇతర ముడిసరకుల్లో సూక్ష్మ స్థాయిలో కల్తీ జరిగినా పసిగట్టే పరీక్షలు ఈ అత్యాధునిక ల్యాబ్‌లో జరుగుతాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. పుణ్య క్షేత్రాల్లో ఈ తరహా ఫుడ్ లేబరేటరీ ఏర్పాటు కావడం ఇదే తొలి సారి అని పేర్కొన్నారు. నూనె, పాలు, నెయ్యిలో ఫెస్టిసైడ్స్, ప్రిజర్వే టివ్స్ వంటి అవశేషాలను కూడా ఈ ల్యాబ్ లో గుర్తిస్తారని తెలిపారు.

కెమికల్ ఎనాలిసిస్, మైక్రోబయాలజీ ఎనాలిసిస్ పరీక్షలకు అనుగుణంగా పరికరాలు/యంత్రాలను ల్యాబ్‌లో సమకూర్చామని పేర్కొన్నారు.

**మంత్రి సత్యకుమార్ చొరవతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి..**

మంత్రి సత్యకుమార్ సమక్షంలో అక్టోబర్ 8, 2024న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)తో న్యూఢిల్లీలో రాష్ట్ర అధికారులు చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఫుడ్ ల్యాబరేటరీ ఏర్పాటైంది. పలు పుణ్యక్షేత్రాల్లో ల్యాబ్స్ ఏర్పా టుపై ఎఫ్ఎస్ఎస్ఏఐతో సదరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగినా కార్యాచరణ మాత్రం తిరుమలతోనే సాధ్యమైంది.

**9 నెలలకు...**

కిందటేడాది జూన్ 1 నుంచి ప్రారంభమైన ల్యాబ్ ఏర్పాటు పనులు ఇటీవలే పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ల భాగస్వామ్యంతో తితిదే సహకారంతో ఈ ల్యాబరేటరీ ఏర్పాటుకు ఒడిఒడిగా అడుగులుపడ్డాయి. గతంలో చోటు చేసుకున్న కల్తీ ఘటనలు దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా తిరుమలలో ల్యాబ్‌కు సుమారు రూ.25 కోట్ల వరకు వ్యయమవుతోశీది. టీటీడీ స్థలానివ్వగా.. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది ఇందులో సుమారు రూ.10 కోట్లతో అత్యాధునిక పరికరాలను ల్యాబ్‌లో సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ల్యాబ్ కూ ట్రాన్సఫార్మర్, జనరేటర్ సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. త్వరలో రూ.3 కోట్లతో ఫ్రాన్స్ నుంచి ఈ-నోస్, ఈ-టంగ్ యంత్రాలు రాబోతున్నాయని తెలిపారు. ఇవి వాసన, రుచిలో తేడాలను గుర్తిస్థాయన్నారు.

చిన్న పెద్దా కలిపి 50 పరికరాలు/యంత్రాలు ఉన్నాయి. ఆహార పదార్థాల్లో సేకరించిన ఒక్కో నమూనాను పదుల సంఖ్యలో పరీక్షించే సామర్థ్యం ల్యాబ్‌కు ఉంది. ముడి సరుకులు, ఇతర నమూనాల విషయాల్లోనూ ఇలాగే పరీక్షలు జరుగుతాయి. గరిష్టంగా ఒక నమూనా ద్వారా 50 రకాల పరీక్షలు చేయడానికి వీలుశీది.

**ప్రసాదాలు, జల, ముడి సరకుల నమూనాల పరీక్షలు**

కొత్తగా ఏర్పాటైన ల్యాబ్లో ప్రసాదాలు, వాటికి వినియోగించే ముడిసరకుల్లో పురుగు మందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమికీటకాలు వంటి వాటి గురించి నమూనాలు పరీక్షించడం ద్వారా తెలుసుకుంటారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, క్రిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు కారం వంటి నమూనాలను ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు. జలప్రసాదాల నమూనాలను సైతం ఇక్కడ పరీక్షిస్తారు. నెయ్యి, నూనెలో ఉండాల్సిన కొవ్వుల శాతం, వెజిటబుల్ ఆయిల్, జంతువుల కొవ్వు వంటివాటిని సులువుగా గుర్తిస్తారు లడ్డూల్లో ఎనర్జీ లెవల్స్, వాడిన నెయ్యిని, ఆహారంలో బ్యాక్టీరియా ఉందా? లేదా? కూడా ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు.

**ఇప్పటివరకు...**

తిరుమలలో 1981లో వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబరేటరీ ఏర్పడింది. 1988లో దీనిని ఉన్నతీకరించి, ఆహార పదార్థాల నమూనాలు పరీక్షించడం ప్రారంభించారు. 2018లో దీనికి ఎనబీఎల్ అక్రిడిటేషన్ లభించింది. ఈ ల్యాబ్లో సాధారణ స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయి.

# ఏబీఎన్ పూర్ణ మృతి జర్నలిజానికి తీరని లోటు



**(రాజధాని వార్తలు):** జర్నలిస్టు అనే పదానికి పరిపూర్ణమైన అర్థానికి నిలువెత్తు నిదర్శనం ఏబీఎన్ ఛానల్ ఏపీ బ్యూరో రిపోర్టర్ కేశంనేని పూర్ణచంద్రరావు. అనారోగ్య సమస్యలతో ఆకస్మికంగా మృతి చెందడం తీవ్రంగా కలచి వేసింది. వృత్తి పట్ల అంకిత భావం, సమాజం పట్ల ఎనలేని గౌరవం, బాధ్యత, సమస్యలపై అధ్యయనం చేసే విధానం చూస్తే జర్నలిజం అంటే ఆయనకు ఎంత ప్రత్యేక అభిమానమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు దేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా రిపోర్టింగ్ చేసే పూర్ణచంద్రరావు... తాను పనిచేసే ఛానల్ పేరునే ఇంటిపేరుగా పిలిపించుకునేంతలా సమాజంలో కీర్తిప్రతిష్టలు గడించారు. ఏబీఎన్ పూర్ణ అంటే యావత్ రాష్ట్రం మొత్తం ఒక ప్రత్యేక గౌరవం. ఇలాంటి మంచి జర్నలిస్టును కోల్పోవడం రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ తీరని లోటు. మంచి, చెడులను నిర్మొహమాటంగా చెప్పే తత్వం ఉన్న మంచి జర్నలిస్టు ఇకలేరు అనే వార్త వినడం బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ... ఆయన మృతికి సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు, జర్నలిస్టు మిత్రులందరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# టీఎంసీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన మమతాబెనర్జీ

**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలగా ఉన్న మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ శుక్రవారంనాడు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మేనిఫెస్టోలో తాను చేసిన 10 ప్రతిజ్ఞలను తిరిగి టీఎంసీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని మీడియా సమావేశంలో మమతా బెనర్జీ తెలిపారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తాము ఇచ్చిన 10 వాగ్దానాలను తప్పసరిగా అమలు చేస్తామని మమతాబెనర్జీ చెప్పారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన ప్రభుత్వంపై ఎన్డీయే కూటమి కుట్ర పన్నిందని, ఎన్నికల సమయాల్లో జరిగే కుట్రలను తాము చాలానే చూశామని, ఈసారి మాత్రం వాళ్లు అన్ని హద్దులు చెరిపేశారని విమర్శించారు. పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలనకు ప్రత్నామ్నాయంగా 'అనధికార రాష్ట్రపతి పాలన'ను బీజేపీ అమలు చేస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాలను పునర్వి భజించడం ద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కేంద్రం,



ఈసీఐ ప్లాన్ చేస్తున్నాయని అన్నారు. జనాభా లెక్కలు, ఎన్ఆర్సీ పేరుతో ప్రజల పౌరసత్వాన్ని ఊడలాక్కునేందుకు కేంద్రం లోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర సాగిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ ఒక నిర్దిష్ట కమ్యూనిటీని టార్గెట్ చేసినట్టు ఆరోపించారు. బెంగాల్‌పై అసూయ కారణంగానే 'అప్రకటిత రాష్ట్రపతి పాలన'తో మోదీ ఇక్కడ ఫైటింగ్ చేస్తున్నారని అన్నారు.

# చంద్రబాబుపై రోజా నిప్పులు.. బీఆర్ నాయుడుపై విమర్శలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం సాక్షిగా ప్రజలకు అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా మండిపడ్డారు. ప్రజలు సంతోషంగా ఉన్నారన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై ఆమె ధ్వజ మెత్తారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహి ళకు నెలకు రూ. 1,500 ఇస్తామన్న హామీ ఏమైంది? అది కేవలం ఓట్ల కోసమేనా? అని ఆమె ప్రశ్నించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గత జగనన్న పాల నలో రైతులు, పేదలు ఎలా సంతోషంగా ఉన్నారో ప్రజలందరికీ తెలుసని ఆమె గుర్తు చేశారు. నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతను నట్టేట ముంచారని, రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తీరుపై కూడా రోజా విమర్శలు గుప్పించారు. టీటీడీ ఛైర్మన్ పదవి నాకు అన్నం పెడుతుందా, నాకు హైదరాబాద్‌లో చాలా వ్యాపారాలు ఉన్నాయి అని బీఆర్ నాయుడు అన్నారని ఆమె మండిపడ్డారు. "అర్హత లేని వారికి పదవులు ఇస్తే ఇలానే మాట్లాడుతారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి. అలాంటి వ్యక్తులను తరిమి తరిమి కొట్టాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# పశ్చిమాసియా సంక్షోభం...మోదీ ప్రభుత్వ వైఖరికి శశి థరూర్ మద్దతు



**న్యూఢిల్లీ :** ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న సంగతి తెలిసిందే. సంక్షోభం తాలూకా ప్రభావం ప్రపంచ దేశాలపై పడింది. ఆయిల్, గ్యాస్, ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. భారత దేశంలోనూ గ్యాస్, ఆయిల్ కొరత ఏర్పడింది. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం పశ్చిమాసియా సంక్షోభంపై గట్టిగా స్పందించకపోవటంపై ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోదీ అమెరికా చేతిలో తోలుబొమ్మగా మారిపోయారని, అందుకే యుద్ధంపై మాట్లాడటం లేదని విమర్శిస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరికి కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ మద్దతు తెలిపారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'నిగ్రహం పాటించడం బలహీనత కాదు, అది గొప్ప బలం. కేంద్ర ప్రభుత్వానికి భారతీయుల భద్రత, ఇంధన అవసరాలు చాలా ముఖ్యం. ఇరు దేశాలతో భారత్ దౌత్యపరమైన చర్చలు జరపాలని కోరుకుంటున్నా. పశ్చిమాసి యాలో శాంతి నెలకొనడం భారత్‌కు ఎంతో అవసరం. చాలా వరకు ఆయిల్, గ్యాస్ సరఫరా దెబ్బతింది. కొంత మొత్తంలో కూడా భారత్‌కు ఆయిల్, గ్యాస్ సరఫరా అవ్వటం లేదు'.. 'యుద్ధం మొదలైనపుడు బ్యారెల్ ఆయిల్ ధర 64 డాలర్ల దగ్గర ఉంది. ఇప్పుడు 100 డాలర్ల నుంచి 120 డాలర్ల మధ్యకు చేరింది. పెట్రోల్ కొరత చాలా తీవ్రంగా ఉంది. అది అన్నిటిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చివరగా నేనేం చెబుతా నంటే మనం బ్యారెల్ విషయంలో బాగా ఇరుక్కుపోయాము. మనమే కాదు చాలా దేశాలది ఇదే పరస్థితి' అని అన్నారు.

# రుణం తీసుకుంటేనే కొంటారా?

## - కాఫీ రైతులపై జీసీసీ వివక్ష.. ఆదివాసీ గిరిజన సంఘం ఆగ్రహం



**చింతపల్లి, (రాజధాని వార్తలు):** మన్యం గిరిజన రైతులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఆత్మీయంగా అక్కున చేర్చుకోవాల్సిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ), కాఫీ గింజల కొనుగోలులో వింత నిబంధనలు విధిస్తూ రైతుల గొంతు కోస్తోందని ఆదివాసీ గిరిజన సంఘం మండిపడుతోంది. కేవలం సంస్థ నుండి రుణాలు తీసుకున్న రైతుల వద్ద మాత్రమే కాఫీ గింజలు కొనుగోలు చేస్తామన్న అధికారుల ప్రకటనపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఈ మేరకు చింతపల్లి మండలం ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబంద గ్రామంలో రైతులు ఆందోళన చేపట్టగా, గిరిజన సంఘం వారికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సం దర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ.. జీసీసీ అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. గతంలో ఊరూరా తిరిగి సమావేశాలు నిర్వహించి, కరపత్రాలు పంచి గిట్టుబాటు ధర కల్పిస్తామని నమ్మబలికిన అధికారులు, తీరా పంట చేతికొచ్చాక మాట మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజనల్ మేనేజర్ డి.సింహాచలం ఇటీవల ఇచ్చిన పత్రికా ప్రకటన అనేక అనుమానాలకు తావిస్తోందని దుయ్యబట్టారు. 2016 నుండి 2025 వరకు ఎకరానికి కనిష్టంగా రూ. 10 వేలు, గరిష్టంగా రూ. 20 వేల వరకు రుణాలు ఇచ్చి, ఇప్పుడు కేవలం ఆ రుణాల మేరకే కొనుగోళ్లు చేస్తామనడం రైతులను వంచించడమేనని పేర్కొన్నారు. అపెక్స్ కమిటీ నిర్దేశించిన లక్ష్యం మేరకు కొనుగోళ్లు పూర్తి చేశామని చెప్పడం హాస్యాస్పదమని, క్షేత్రస్థాయిలో ఇంకా వందలాది టన్నుల పంట రైతుల వద్దే మూలుగుతోందని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్గానిక్ చెర్రీ కాఫీ కిలో రూ. 270, పార్చ్‌మెంట్ రూ. 450, రోబస్టా రూ. 170 చొప్పున కొనుగోలు చేస్తామని ఆశ చూపి, ఇప్పుడు ముఖం చాటేయడం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారుల చేతిలో మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కై, నాణ్యత లేని కాఫీని కొంటూ జేబులు నింపుకుంటున్నారని, తద్వారా జీసీసీ ప్రతిష్టను మంటగలుపుతున్నారని ఆరోపించారు. ఒక్క ఎర్రబంద గ్రామంలోనే 70 టన్నుల నిల్వలు ఉన్నాయని, చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని అనేక గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉందని తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలతో నిమిత్తం లేకుండా గిరిజన రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని చిరంజీవి హెచ్చరించారు.

# నాలుగు లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలి



**ఏలూరు జిల్లా, (రాజధాని వార్తలు):** నాలుగు లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు మార్కెట్ కూరగాయల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్‌పోస్టర్స్ ఏలూరు వన్ టౌన్ ఏరియా కల్పనా థియేటర్ వద్ద ఉన్న ఆఫీసు ఆవరణలో ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బద్దా వెంకట్రావు ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలూరు మాట్లాడుతూ దేశంలో బిజెపి సర్కార్ కార్మిక వర్గంపై పెను దాడు చేస్తూ అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ ఒకటో తారీకు నుండి అమలు చేయాలని ఆలోచనలో ఉన్నారు. వాటి అమలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని వెంకట్రావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఇప్పటికే 1926 ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సవరణలు ప్రతిపాదించి కార్మికుల ప్రాథమిక హక్కులపై కుట్రలు పన్నుతున్నారని, చారిత్రాత్మక మేడే పోరాటం ద్వారా సాధించుకున్న 8 గంటల పని దినాన్ని 12 గంటల పని దినంగా మారుస్తున్నారు. ఆటో మోటార్ కార్మికులు హమాలీ కార్మికులు ఇతర అనేక రకాల పనులు చేసే కార్మికులు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా యూనియన్ హక్కును సమ్మె హక్కును సమూలంగా దెబ్బతీసే ఈ నాలుగు లేబర్ కొడుస్ పారిశ్రామిక వివాదాల పరిష్కారానికి వినియోగించబడిన పారిశ్రామిక వివాదాల చట్టాన్ని పారిశ్రామిక సంబంధాల చట్టాన్ని (ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్) మార్చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చినారు ఆ నేపథ్యంలోనే ఈనెల మార్చి 23వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా ఏర్పాటు చేయుచున్నాము. ఈ ధర్నాకి కార్మిక వర్గం తరలి రావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. వాల్ పోస్టర్స్ కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన వారు రంగాల నూకరాజు చంద్రగిరి బాలాజీ కొమ్మిరి సాయిబాబా జి.లావరాజు పోలవరపు పెంటయ్య సత్తిబాబు నిల్లి లీల గూగుళ్ల వెంకన్న, కుప్ప రాజు పిల్లి అర్జున్ కొమ్మిరి లక్ష్మణ్ చంద్రగిరి పెద్దిరాజు లింగంపల్లి శ్రీనివాసరావు, బి శ్రీనివాసరావు వేముల బాలయేసు తదితరులు పాల్గొన్నారు.


# పరాభవ సంవత్సరం ప్రగతికి మార్గం కావాలి






**ఏలూరు, (రాజధాని వార్తలు):** భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా పరాభవ సంవత్సరం ప్రగతికి మార్గం కావాలని ఏలూరు ఎమ్మెల్యే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఏలూరు రామచంద్రరావు పేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అర్చకులు నారాయణాచార్యులు వేద పండితులు యనమండ్ర రవి ప్రకాష్, చందు ఆధ్వర్యంలో వేదపఠనం చేసి ఎమ్మెల్యే బడేటి చంటికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని టిడిపి కుటుంబ సభ్యులు కూటమి సభ్యులు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సమైక్యమై ఐక్య పోరాటం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ఆయన సూచించారు. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి నాయకులు మరింత ఐక్యమై సోషల్ మీడియా ద్వారా వైసిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఆర్ఆర్ పేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి ధర్మకర్తలు ఈతకోట శ్రీనివాసరావు నంగులూరి సత్యనారాయణ ఏలూరు నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం మరియు పలువురు కార్పొరేటర్లు క్లస్టర్ ఇంచార్జిలు డివిజన్ ఇంచార్జ్ లు తెలుగుమహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం సమన్వయంతో విజయ పరంపరలతో ముందుకు సాగాలి







**ఏలూరు జిల్లా, (రాజధాని వార్తలు):** చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలం పరాభవనామ ఉగాది పర్వదినం సందర్భంగా కూటమి ప్రభుత్వం సమన్వయంతో విజయ పరంపరలతో ముందుకు సాగాలని వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు పరాభవ నామ షడ్రుచుల సమ్మేళనం, పరవశింపచేసే వసంతకాల ఆగమనం, అన్నింటినీ మించిన ఆనందం, భావి జీవితంపై ఆశ రేకెత్తించే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా శ్రీ మద్ది ఆంజినేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు సమర్పించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చింతలపూడి నియోజకవర్గమైన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో వేంచేసి ఉన్న మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం పంచాంగ శ్రవణ పుస్తకాన్ని ఆవిష్కరించారు ఉగాది పచ్చడి స్వీకరించిన కూటమి నేతలు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఘంటా మురళి రామకృష్ణ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తపన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకకు హాజరైన రెడ్డి అప్పలనాయుడు శిరిపల్లి శివరామకృష్ణప్రసాద్





**ఏలూరు, (రాజధాని వార్తలు):** స్థానిక 25వ డివిజన్ శ్రీరామ్ నగర్ లోని తపన ఫౌండేషన్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తపన ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకకు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వేద పఠనం, పంచాంగ శ్రవణం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# స్వయంభు విఘ్నేశ్వర స్వామి తిరువీధి ఉత్సవ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు



**చోడవరం, (రాజధాని వార్తలు):** ప్రజలలో భక్తిభావం పెంపొంది ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వలన సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు అన్నారు దాతలు సువ్వాడ విజయలక్ష్మి కుటుంబ సభ్యులు భక్తులు సుమారు 8 లక్షల రూపాయల వ్యయంతో తయారుచేసి అందజేసిన తిరువీధి ఉత్సవ రథాన్ని ఉగాది పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావాలు పెంపొంది ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం వలన సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రజల మధ్య ఐక్యతా భావాలు పెంపొందుతాయని ఆయన అన్నారు చరిత్ర ప్రసిద్ధి కలిగిన స్వయంభు విఘ్నేశ్వర స్వామికి తిరువూరు ఉత్సవాలు నిర్వహించేందుకు అణువుగా రథం సమకూరడం ఆనందదాయకం అన్నారు గౌరీశ్వర స్వామి వారికి రథోత్సవానికి రథం ఉందని విగ్నేశ్వర స్వామికి కూడా ప్రస్తుతం రథం ఏర్పాటు కావడం వలన ఆయా దేవాలయాల పర్వదినాలో నిర్వహించే రథోత్సవాలకు రథాన్ని ఏర్పాటు కావడం ఆనందదాయకం అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజుతో పాటు గూనూరు మల్లు నాయుడు పసుమర్తి సాంబ గూనూరు సురేష్ రథం సమకూర్చిన సువ్వాడ విజయలక్ష్మి కుటుంబ సభ్యులు మాజీ ఎంపీపీ గూనూరు సత్యనారాయణ ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్ వి వి సత్యనారాయణ తదితర భక్తులు పాల్గొన్నారు.

# చింతపల్లిలో వడగళ్ల వాన - ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం





**చింతపల్లి, (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలకు మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పెద్ద ఎత్తున వడగళ్లు పడటంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై వర్షం ప్రారంభమైంది. వర్షంతో పాటు గోళీకాయంత పరిమాణంలో వడగళ్లు ఏకధాటిగా పడ్డాయి. రోడ్లు, ఇళ్ల ప్రాంగణాలు వడగళ్లతో నిండిపోయి తెల్లటి పరపును తలపించాయి. గాలుల తీవ్రత పెద్దగా లేకపోయినప్పటికీ, భారీ వడగళ్ల వల్ల శబ్దం రావడంతో జనం ఆసక్తిగా గమనించారు. వర్షం వల్ల వాతావరణం చల్లబడి సామాన్యులకు ఊరట లభించినా, రైతాంగానికి మాత్రం కష్టాలు తప్పలేదు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న పంటలపై వడగళ్లు పడటంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. వడగళ్ల వానను చూసేందుకు జనం ఇళ్ల బయటకు వచ్చి ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు.

# ఆదర్శ యువనేత బొలిశెట్టి రాజేష్



**తాడేపల్లిగూడెం టౌన్, (రాజధాని వార్తలు):** నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా నిస్వార్థంగా పనిచేస్తున్న జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ యువతకు ఆదర్శంగా నిలిచారని పలువురు అభిమానులు ప్రశంసించారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు,జనసేన యువనాయకుడు బొలిశెట్టి రాజేష్ జన్మదినం సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జనసైనికులు మాట్లాడుతూ తండ్రి బాటలో నిస్వార్ధంగా ప్రజా సేవ చేస్తున్నారని అభినందనలు తెలిపారు. జనసేన సిద్ధాంతాలను ప్రజలలో కి తీసుకెళ్లడంలో రాజేష్ విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తోట రాజా, నీలపాల దినేష్, పట్టణ వర్తనపల్లి కాశి చేపల రమేష్, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కోదండ రామస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అట్లూరి రాజశేఖర్ దంపతులు



**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** బాపులపాడు మండలం రంగయ్య అప్పారావు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అట్లూరి రాజశేఖర్, చైతన్య దంపతులు స్వామి వార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం పంచాంగ శ్రవణం, జరిగింది. స్వామివారికి ప్రసాదాలు పరుచూరి రామకృష్ణ, సుకన్య దంపతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి పరుచూరి సుకన్య మాట్లాడుతూ ఈ సంవత్సరం మండలంలో పంటలు సమృద్ధిగా పండాలని సంకల్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరుచూరి రామకృష్ణ, కొల్లిపర రత్న మాణిక్యం, పరుచూరి వెంకటసుబ్బమ్మ, కొల్లిపర భవాని, కొల్లిపర వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# శివశక్తి ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామంలో తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** బాపులపాడు మండలం బాపులపాడు గ్రామం, శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో శివశక్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం అనంతరం తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు శివశక్తి ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు మరియు శ్రీ మారేపల్లి నరసింహచార్యులు చేతుల మీదుగా క్యాలెండర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మారేపల్లి నరసింహచార్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత మన ధర్మానికి రెండు ప్రధాన ప్రభావాలు పెరుగుతున్నాయని తెలిపారు. వాటిలో ఒకటి ఇంగ్లీష్ సర్టిఫికేట్ విద్యా విధానం కాగా, మరొకటి బ్రిటిష్ పద్ధతిలో కొనసాగుతున్న ఇంగ్లీష్ క్రైస్తవ క్యాలెండర్ అని పేర్కొన్నారు. దీని కారణంగా మన సంస్కృతి, సంప్రదాయాలు, తిథులు, పండుగల పట్ల కొత్త తరంలో అవగాహన తగ్గిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన సంప్రదాయాలను కాపాడుకోవడానికి తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ప్రతి ఇంట్లో ఉపయోగించుకోవాలని, శుభతిథులు, పండుగలు, ఆచారాలు తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని సూచించారు. ఈ దిశగా శుభతిథి తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశక్తి సభ్యులు కే. శ్రీనివాసరావు, దావులూరి శ్రీహరి, వడ్డీల్లి లక్ష్మి, ధర్మజాగరణ కృష్ణాజిల్లా కన్వీనర్ ఎదురువాడ శ్రీనివాసరావు, జలసూత్రం శ్రీహరి, బీజేపీ రమేష్, జింక నలగమరాజు, అప్పలరాజు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కి జర్నలిస్టుల ఆత్మీయ సత్కారం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తెలుగువారి తొలి పండుగ ఉగాది సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్.. హరేంధిర ప్రసాద్ ను లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(ఎల్ ఎన్ ఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నగరంలోని సిరిపురంలో గల వీఎమ్ఆర్డిఏ చిల్డ్రన్స్ ఏరినాలో గురువారం జరిగిన ఉగాది ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను కలిసి దుశ్శాలువా కప్పి పూల బొకే అందజేశారు. ఆయనకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల మిత్రులందరికీ కలెక్టర్ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏ శుభవేళ అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. విశాఖ జిల్లా కలెక్టర్ గా ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటినుండి జర్నలిస్టులకు అన్ని విధాలా సహకారం అందజేస్తున్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50% స్కూలు ఫీజు రాయితీ, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ ఎస్) కింద జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియంను సిఎస్ఆర్ నిధుల నుండి చెల్లించి ఎంతో తోడ్పాటునిచ్చారు. జర్నలిస్టులకు ఉచితంగా ప్రైవేటు సంస్థలలో వైద్య పరీక్షలు నిర్వహించి సహకరించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవలను జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సూరంపూడి వీరభద్రరావు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్ఎ) అధ్యక్షుడు పి .సత్యనారాయణ, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, ఎల్ ఎన్ఏ ప్రతినిధులు కొయిలాడ పరశురాం,బొంతు నారాయణరావు, ఎన్.ఎస్.ఆర్ గుప్త,ఎం. శ్రీహరి, పృథ్వీరాజు, సూర్య ప్రకాష్, ఎస్. ఎన్.నాయుడు, బోని ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేపు చింతపల్లి తాలూకా 'ఏపీ జేఏసీ' నూతన కార్యవర్గ ఎన్నిక



**చింతపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) చింతపల్లి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఈ నెల 21వ తేదీ శనివారం ఎన్నుకోనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక చింతపల్లి మండల ఏపీ ఎన్జీవో భవనంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఉగ్రంగి వెంకటగిరి, కో–ఛైర్మన్ కుడుముల వెంకటరమణ శనివారం నాటి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగుల హక్కుల సాధనలో ఏపీ జేఏసీ ఎల్లప్పుడూ ముందుంటుందని, తాలూకా స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. చింతపల్లితో పాటు జీకే వీధి, కొయ్యూరు మండలాల్లోని అన్ని ప్రభుత్వ శాఖల సంఘ ప్రతినిధులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు. ఆయా మండలాల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏపీ జేఏసీలో క్రియాశీలక పాత్ర పోషించాలని, ఏకగ్రీవంగా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. మూడు మండలాల పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయ లోకం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఐక్యతను చాటాలని వారు విజ్ఞప్తి చేశారు.

# అనకాపల్లిలో రాజకీయ సంచలనం

## - కమలం గూటికి ప్రముఖ వ్యాపారవేత్త, సేవాపరుడు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్)










**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోబోతోంది. సుదీర్ఘ కాలంగా తన సేవా కార్యక్రమా లతో సామాన్యుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘ సేవకుడు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లో చేరబోతున్నారనే వార్త ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన కాషాయ తీర్థం పుచ్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వ్యాపార రంగంలో రాణిస్తూనే, అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని నిరుపేదలకు, అట్టడుగు వర్గాలకు అండగా నిలవడంలో ఎం.వి.ఆర్ ఎప్పుడూ ముందుంటారు. విద్య, వైద్యం, మరియు సామాజిక అభివృద్ధిలో ఆయన చేసిన కృషి అమోఘం. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి పట్ల బీజేపీకి ఉన్న అంకితభావం పట్ల ఆకర్షితులై, ఆ పార్టీ ద్వారా ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం.

**వెల్లువెత్తిన కృతజ్ఞతలు:**

విజయరామరాజుపేట కాపు సంఘం యువకులు ఎం వి ఆర్ కు ఉగాది శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, ఎం.వి.ఆర్ బిజెపిలో జాయిన్ అవుతున్నారని విషయం తెలియగానే అనకాపల్లిలోని ఆయన నివాసానికి చేరుకొని శుభాకాంక్షలు తెలియజేసారు.

అలాగే, ఆయన అభిమానులు శ్రేయోభిలాషులతో ఎం వి ఆర్ కార్యాలయం కిక్కిరిసిపోయింది.

# కొత్త ఏడాది ప్రజలందరికీ శుభకరం కావాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం టౌన్, (రాజధాని వార్తలు):** శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభకరం కావాలని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రగతి పదంలో ముందుకు సాగాలని, శాసనస భ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. నూతన తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా, గురువారం శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ వారిని ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతశ్రీ బలుసులమ్మ వారి జాతర మహోత్సవంలోఈ సంవత్సరం ఉగాది పండుగ ప్రత్యేక శోభను సంతరించుకుందని అన్నారు. 12 సంవత్సరాల తర్వాత ఈ జాతర నిర్వహించే మహాభాగ్యాన్ని అమ్మవారు కల్పించారని, ప్రతి ఒక్కరు జాతరలో పాల్గొని బలుసులమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ప్రభుత్వాలు మారినా, అధికారంలో ఎవరు ఉన్నా,జాతర నిర్విఘ్నంగా కొనసాగాలని అన్నారు.ప్రతి 5 సంవత్సరాలకు జాతర నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులతో తాడేపల్లిగూడెం సుభిక్షంగా ఉండేవిధంగా అందరూ కృషి చేయాలని అన్నారు. తాడేపల్లిగూడెంలో ఎవరి ఇంట వివాహం జరిగినా, ముందుగా గ్రామ దేవత బలుసులమ్మ వారికి చలిమిడి, పానకాలు సమర్పించిన తర్వాతే వివాహం జరగటం తరతరా లుగా వస్తున్న సంప్రదాయమని అన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా అమ్మవారి ఆలయం ఎలాంటి అభివృద్ధి లేకుండా నిర్లక్ష్యానికి గురైంది అన్నారు. 40 సంవత్సరాల తర్వాత మొదటిసారి తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో జాతర నిర్వహించామని, మరలా ఇప్పుడు నిర్వహించే అవకాశం అమ్మ వారు కల్పించారని అన్నారు. జాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం భగత్ సింగ్ కాలనీ, టిట్కో గృహాల కొమ్ముగూడెం, వెంకటరమణ గూడెం పెంటపాడు, వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు పోలిశెట్టి రాజేష్,చేపల రమేష్, మద్దాల మణికుమార్, కసిరెడ్డి మధులత, వాడపల్లి సుబ్బరాజు, పైబోయిన వెంకటరామయ్య, గద్దం నాని, సురేషు, అబ్బో, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అమెరికా వెలుగులకు క్యూబన్ చీకట్లు ఎందుకు?

'క్యూబా విషయంలో నేను ఏమనుకుంటే అది చేయగలను.. దాన్ని స్వాధీనం చేసుకునే గౌరవం నాకు లభిస్తుందని భావిస్తున్నాను' నాలుగురోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. ఇరాన్ మీద మొదలుపెట్టిన అధర్మయుద్ధంలో కూరుకుపోయి ఏమి చేయాలో తోచని పరిస్థితుల్లో మరో దేశాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లుగా ఈ వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. ఇటీవల కాలంలో వెనెజువెలాతో మొదలైన ప్రభుత్వాధినేతల మార్పు, అనుకూల రాజ్యాల ప్రతిష్ఠాపన పరంపరలో త్వరలో క్యూబా చేరబోతోంది. అమెరికాతో విభేదించి, దాని సామ్రాజ్య కాంక్షలకు గండికొట్టి, నచ్చిన మార్గంలో స్వతంత్రంగా వ్యవహరించిన దేశాల్లో ఒకప్పుడు క్యూబాకు ప్రముఖస్థానం ఉంది. పశ్చిమాసియాలో అమెరికా ఆధిపత్యానికి ఇరాన్ ఒకరకంగా 1979లో సవాలు విసిరితే అంతకు 20 ఏళ్లకు ముందు క్యూబా అంతకుమించిన సాహసాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శించింది. ఇరాన్‌లో 1979 నాటి ఇస్లామిక్ విప్లవం దాని చుట్టూ ఉన్న కొన్ని ముస్లిందేశాల పాలకులను భయపెడితే, 1959 నాటి క్యూబన్ విప్లవం లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఎందరికో ఉత్తేజంగా నిలిచింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ముఖ్యంగా సొంత ఖండంలో తనకు తిరుగులేదనుకున్న అమెరికాకు క్యూబా పక్కలో బల్లెంలా మారింది. అమెరికా కోరుకున్న రాజకీయ వ్యవస్థలను ఏర్పాటు చేయలేని, కావాలనుకునే ఆర్థిక విధానాలను అమలు చేయలేని చిన్న, మధ్యస్థాయి దేశాలకు వరుసగా ముప్పు ముంచుకొస్తోందని ట్రంప్ వ్యాఖ్యలను చూస్తే తేలికగా అర్థమవుతుంది. పరిస్థితి అంతమేరకే పరిమితమయ్యేలా ఉందని కూడా చెప్పలేం. భారత్ లాంటి పెద్దదేశమే ఎటూ నోరు విప్పలేని స్థితిలో ఉంది. రష్యా నుంచి చమురు కొనొద్దని శాసిస్తే అమలుపరచాల్సిన అగత్యం ఏర్పడింది. ఇరాన్‌పై దాడులతో ఏర్పడిన ఒడిదుడుకులను ఎదుర్కోటానికి రష్యా నుంచి నెలపాటు చమురు కొనుగోళ్లకు భారత్‌కు అనుమతిని ఇస్తున్నామని బహిరంగంగా ప్రకటించి చిన్నబుచ్చినా ఏమీ చేయలేని అశక్తత ఆవరించింది. చైనా లాగా భారత్‌ని ఆర్థికంగా ఎదగనీయబోమనే అర్థంలో అమెరికా విదేశాంగశాఖ సహాయమంత్రి క్రిస్టొఫర్ లాండో ఈనెల 5న ఢిల్లీలో ప్రకటించినా గట్టిగా, సూటిగా, నిక్కచ్చిగా ఖండించలేని నిర్బలతే కన్పించింది. భారత-అమెరికా వ్యాపార సంబంధాలపై ఏర్పాటైన చర్చా వేదికపైనే ఎటువంటి మొహమాటం లేకుండా లాండో ఆ ప్రకటన చేశారు. అమెరికాను మరోమారు గొప్ప దేశంగా మారుస్తామనే నినాదాన్నీ విధానాన్నీ అంది పుచ్చుకున్న తర్వాత సంభాషణల్లో, ప్రకటనల్లో ఔచిత్యాలను ఆ దేశ నాయకులు పట్టించుకోవటం లేదు. వస్తుసేవల్లో నాణ్యతను మెరుగుపరచటానికీ, నవ్యతను తీసుకురావటానికీ, కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటానికీ వ్యాపారరంగంలో పోటీతత్వానికి మించిన ప్రత్యామ్నాయం లేదని ఒకప్పుడు ఇంటాబయటా వినిపించిన వాదనలు ఇప్పుడు కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించటం లేదు. అమెరికాకు పూర్వవైభవాన్ని తేవటానికి ఏ దుశ్చర్యకైనా దిగుతామనే ధోరణే ఇప్పుడు వినిపిస్తోంది. దేశాల మధ్య తలెత్తే సమస్యల పరిష్కారానికి మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన నానాజాతి సమితిని హిట్లర్, ముసోలిని లాంటి నియంతలు పట్టించుకోలేదు. విజేత రాజ్యాలన్నీ కలిసి ఏర్పాటుచేసిన సంస్థను ఎందుకు లెక్కపెట్టాలన్న ధోరణితో దాని నిబంధనలన్నిటినీ ధిక్కరించి హిట్లర్ యూరప్‌లో ఒక్కోరాజ్యాన్ని చెరబట్టారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత స్వయంగా అమెరికా ప్రోద్బలంతో ఏర్పాటైన ఐక్యరాజ్యసమితికీ ఇప్పుడు అదేస్థితి వచ్చింది. తేడా అల్లా ఒక్కటే. స్థాపించిన వారే ఇప్పుడు దాని అస్తిత్వాన్ని లెక్కచేయటం లేదు. ఐక్యరాజ్యసమితికి సమస్యలు తీసుకెళ్లకుండా, అందులో చర్చలు లేకుండా యుద్ధాలను ప్రకటించటమూ, రాజ్యాధినేతలను ఎత్తుకుని పోవటమూ, హతమార్చటమూ అమెరికాకు ఇప్పుడు రివాజుగా మారింది. అమెరికాకు భూభాగం కొరత ఎప్పుడూ లేదు. విస్తీర్ణం పరంగా ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. వనరులపరంగానూ లోటులేదు. కానీ విస్తరణకాంక్షతోనే మొదటినుంచీ తన్నుకులాడుతోంది. క్యూబా విషయంలో అది మరింత నిజం. క్యూబాను స్పెయిన్ నుంచి కొనుగోలు చేయటానికి ప్రయత్నాలూ చేశారు, ఆక్రమించుకోటానికి పావులూ కదిపారు. థామస్ జఫర్‌సన్ అమెరికా అధ్యక్షుడిగా (1801-1809) ఉన్నప్పుడే ఈ వ్యవహారాలు నడిచాయి. స్పెయిన్ వాటిని పడనీయలేదు. లాటిన్ అమెరికాలో మిగతా దేశాలపై పెత్తనాన్ని 1820ల నాటికే వదులుకోవాల్సి వచ్చినా క్యూబాపై పట్టును వీడలేదు. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో ఆనాడు క్యూబా అగ్రస్థానంలో ఉండటమే అందుకు కారణం. 19వ శతాబ్దంలో సామ్రాజ్య శక్తిగా స్పెయిన్ ప్రాబల్యం క్షీణించిపోయింది. అదే సమయంలో క్యూబన్ జాతీయవాదులు బలం పుంజుకున్నారు. స్పెయిన్‌పై యుద్ధానికీ దిగారు. విస్తరణకాంక్షతో ఉన్న అమెరికాకు అది చక్కని అవకాశంగా పరిణమించింది. జాతీయవాదుల పక్షాన స్పెయిన్‌తో యుద్ధానికి దిగింది. స్పెయిన్ ఓడిపోయింది. క్యూబాకు స్వాతంత్ర్యం లభించింది. అయితే ఆ సంతోషం కొద్దికాలం కూడా నిలవలేదు. అన్నింటా తనకు లోబడి ఉండాలనే షరతులను అమెరికా విధించింది. అనుకూల వ్యాపార ఒప్పందాలను క్యూబాపై రుద్దింది. సముద్రతీరం పక్కనే ఉన్న క్యూబాకు చెందిన 'గ్వాంటానమో-బే'నీ అప్పుడే స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ అమెరికా సైనికస్థావరం అక్కడే ఉంది. పేరుకు స్వతంత్రదేశమైనా అమెరికాను ఎదిరించలేని క్యూబా నిజానికి వలస ప్రాంతంగానే ఉండిపోయింది. 1898 నుంచి 1933 వరకూ అమెరికా సైన్యం క్యూబా నుంచీ కదల్లేదు. పొరుగుదేశాలతో మంచిగా మెలగాలంటూ (గుడ్ నేబర్) ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన విధానంతో అమెరికా సైనికులు క్యూబాను వదిలారు.

# సేవలకు ప్రతిరూపం బ్రహ్మకుమారిస్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సమాజ సేవలో ప్రజాపిత బ్రహ్మకుమారిలు నిరంతరం విశేష సేవలు అందిస్తు న్నారని, వారు సేవలకు ప్రతిరూపమని విఎమ్ఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్.. విశాఖ జిల్లా బిజెపి అధ్యక్షులు ఎం ఎన్ ఎం పరశురామ్ రాజులు కొనియాడారు.. డాబా గార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్ క్లబ్‌లో బ్రహ్మకుమారిల ఆధ్వ ర్యంలో ఉగాది సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీరు మాట్లా డుతూ అన్ని పండుగలు నిర్వహించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను బ్రహ్మకుమారీస్ ఎన్నో చేపడుతూ పలు సంస్థలకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు.. తెలుగు సంవత్సరాది ఉగాది అందరి జీవితాల్లోనూ వెలుగులు నింపాలని వీరు ఆకాంక్షించారు.. అలాగే ఉగాది నేపథ్యంలో పలువురు ప్రముఖులను సత్కరించుకోవడం కూడా అభినందనీయమన్నారు. కార్యక్రమం నిర్వాహకురాలు ప్రజాపిత బ్రహ్మకుమారి బికే రామేశ్వరి మాట్లాడుతూ ఉగాది నుంచే తెలుగు నూతన సంవత్సరం ప్రారంభమవుతుందన్నారు.. అయితే మారుతున్న కాలానికి తగ్గట్లుగా ప్రజలు కూడా తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని .. ప్రతి ఒక్కరూ తమ దయనందిన జీవితంలో మరింతగా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు.. ఈ ఉగాది పర్వదినం మంచి చెడుల విశిష్టతను స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. అందువల్లే ఉగాది పచ్చడిలో కూడా తీపి.. కారం.. చేదు.. వగరు అన్నీ కూడా సమపాళ్లలో ఉంటాయన్నారు..కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి .ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా పలు సేవ కార్యక్రమాలు చేపట్టడం, అందులో పలువురు ప్రముఖులును సత్కరించుకోవడం సంతోషదాయకమన్నారు.. ఈ ఉగాది మంగళకరమనే సిద్ధాంతకర్తలు చెబుతున్నారని కాబట్టి ప్రతి ఒక్కరు ఆనందమయ జీవితం గడపాలని గంట్ల శ్రీనుబాబు.. ఆకాంక్షించారు ప్రధానంగా దైవరాధన తోనే అన్ని సమస్యలు పరిష్కారం కాగలవని అందరి జీవితాల్లో కూడా సంతోషాలు మెండుగా ఉంటాయన్నారు.. ఈ సందర్భంగా అమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ శీతల్..విశాఖ కళాకారుల సంఘం అధ్యక్షులు జనార్ధన్.. నంది అవార్డు గ్రహీత శివ జ్యోతి. ప్రముఖ నాట్య గురువు. కన్నం రమణరావు.. రంగ సాయి సంస్థ నిర్వాహకురాలు హైమావతి .. పంచాంగ కర్త సోమయాజుల నటరాజేశ్వర రావు తదితరులును అతిథులు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా జర్నలిస్టులందరికీ ఉగాది ప్రత్యేక కిట్లను రామేశ్వరి చేతుల మీదుగా బహుకరించారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### - ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉడా చిల్డ్రన్ థియేటర్లో మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలోని నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ ముస్లిం సోదరులు ఈ పవిత్ర మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, ఆత్మానిగ్రహం, క్రమశిక్షణ మరియు సేవాభావం సమాజంలో గొప్ప స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ పవిత్ర మాసం ప్రతి ఒక్కరి మనసులో పరస్పర ప్రేమ, దయ, దాతృత్వ భావాలు పెంపొంది సమయం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాల ముస్లింలకు చేపట్టిందని ఈ సందర్భంగా తెలిపారు. మత సామ్రాజ్యం మరింత బలపడేలా ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు ప్రోత్సహిందనీ తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రెహమాన్, కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, సౌత్ టీడీపీ ఇంచార్జి సుధాకర్, కార్పొరేటర్ సాదిక్, పెద్దలు పెద్ద రెహమాన్, హనీఫ్, సలీం, ముస్లిం మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

### - దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు - దివ్యాంగులకు ఉగాది కానుకగా చరిత్రాత్మక పథకం ప్రారంభించిన కూటమి ప్రభుత్వం - రాష్ట్ర వ్యాప్తంగా 12.76 లక్షల మంది దివ్యాంగులకు మేలు






**అమలాపురం, (రాజధాని వార్తలు):** దివ్యాంగుల కష్టాలను గుర్తించి వారికి ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి చారిత్రాత్మక పథకాన్ని అమలు చేయడంతో దివ్యాంగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉన్న మానవీయ కోణానికి నిదర్శమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద 'దివ్యాంగ శక్తి' పథకం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఎమ్మెల్యే ఆనందరావు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి ఆయన బస్సులో ప్రయాణించి వారికి ఉచిత టికెట్లను అందజేశారు. గతంలో కేవలం 4 వర్గాలకే పరిమితమైన ఈ సౌకర్యాన్ని ఇప్పుడు 21 వర్గాల దివ్యాంగులకు విస్తరించి, రాష్ట్ర వ్యాప్తంగా 12.76 లక్షల మందికి దివ్యాంగ శక్తి పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. యువగళం పాదయాత్రలో దివ్యాంగుల కష్టాలను కళ్లారా చూసిన యువనేత నారా లోకేష్ చొరవ, సామాజిక న్యాయం కోసం నిరంతరం తపించే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతుతోనే ఈ పథకం త్వరగా కార్యరూపం దాల్చిందని అన్నారు. ఈ ముగ్గురు నేతల కలయి కతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకుందన్నారు.

**ఈ పథకం ద్వారా దివ్యాంగులకు కలిగే మేలు :**

21 వర్గాల దివ్యాంగులకు ఈ పథకం ద్వారా 100 శాతం ఉచితం ప్రయాణ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కలిగించిం దన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు.

సహాయకులకు ఊరట:... దివ్యాంగుల వెంట వచ్చే అటెండెంట్లకు (సహాయకులకు) టికెట్ ధరలో 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 194 బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని గతంలో ఉన్న పాసులే ఈ ఉచిత ప్రయాణానికి చెల్లుబాటు అవుతాయన్నారు. అమలాపురం నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆనందరావు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, అమలాపురం ఏఎంసి చైర్మన్ అధికార వెంకట జయలక్ష్మి, యాళ్ల దొరబాబు, పోలమూరి ధర్మపాల్, ఆర్టీసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా మ్యాపింగ్‌లో అప్రమత్తంగా వ్యవహరించాలి

### - అధికారులు, బీఎల్వోలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు, బూత్ లెవల్ అధికారులకు (బీఎల్వోలు) జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో పని చేస్తున్న అధికారులు, బీఎల్వోలకు గురుజాడ కళాక్షేత్రంలో బుధవారం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉదయం నాలుగు నియోజకవర్గాల వారికి, మధ్యాహ్నం మూడు నియోజకవర్గాల వారికి విడివిడిగా శిక్షణ ఇచ్చారు. రెండు సెషన్లలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చి ఖచ్చితమైన మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలను సమగ్రంగా పరిశీలించి, ఎటువంటి డూప్లికేట్లు, లోపాలు లేకుండా డేటాను సరిచూడాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో కొనసాగాలని, ప్రతి దశలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు, ఎలక్షన్ సెల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యర్థాలతో సంపద - స్వచ్ఛరథం వాహనం ప్రారంభం





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రతిరోజు మన జీవన విధానంలో గృహాలలో పోగయ్యే వ్యర్థాలతో సంపద సృష్టించే స్వచ్ఛరథం వాహనాన్ని బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలలో పోగయ్యే వ్యర్థాలను సంపదగా మార్చే ఉద్దేశంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన చెత్తకు బదులుగా నిత్యావసర వస్తువుల పంపిణీ చేయుట ఈ వాహనం యొక్క ఉద్దేశం అని సర్పంచ్ తెలిపారు. ఇళ్ల వద్ద పోగయ్యే ప్లాస్టిక్, గాజు వంటి వ్యర్థాలకు బదులుగా స్వచ్ఛ రథం నిత్యవసర వస్తువులను ఇస్తుందని ప్రజలు గమనించి వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పార వేయకుండా స్వచ్ఛ రథం వాహనం వచ్చినప్పుడు వ్యర్థాలను ఇచ్చి నిత్యవసర వస్తువులను తీసుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి ప్రజలను కోరారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పారవేసి పర్యావరణానికి హాని చేయకుండా స్వచ్ఛ రథం వాహనానికి ఇవ్వడం ద్వారా పర్యావరణానికి మేలుతో పాటు సంపద కలుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, చింతా శ్రీను, జూనియర్ అసిస్టెంట్ చిట్టిబాబు, వినాయకరావు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై డిఆర్ఎం తనిఖీలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌ను "అమృత్ స్టేషన్ స్కీం"లో భాగంగా రూ.15.13 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివద్ధి పనులను డిఆర్ఎం పరిశీలించారు. ప్రత్యేక రైలులో సామర్లకోట చేరుకున్న డీ.ఆర్.ఏం మోహిత్ సోనాకీయకు స్టేషన్ మేనేజర్ రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులు ఆయన పరిశీలించారు. పనులను ఎంత మేర పూర్తి చేశారు, ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు అవలంభిస్తున్నారో పరిశీలించి పనులు వేగ వంతం చేయాలన్నారు. కాగా స్టేషన్ ఆవరణలోని అన్ని ప్రాంతాలను డీఆర్ఎం క్షుణ్ణంగా పరిశీలిం చారు. అనుకున్న సమయానికి పనులను పూర్తి చేయాలని, ప్లాట్‌ఫారమ్‌పై పనులు చేస్తున్నప్పుడు ప్రయాణికుల భద్రతకు ప్రాదాన్యత ఇవ్వాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆయన సూచించారు. ఈ పర్యటనలో రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయి పల్లవిని మణి సర్ ఎలా చూపించబోతున్నారో?





మణిరత్నం..భారతీయ దర్శకుల్లో ఓ లెజెండ్. తనదైన పంథాలో సినిమాలని తెరకెక్కించడంలో అయిన శైలి ప్రత్యేకం. ప్రేమకథా చిత్రాలకు సమకాలీన అంశాలని జోడించి వెండి తెరపై అందమైన దృశ్యకావ్యాలుగా ఆవిష్కరించడంలో మణి రత్నం మాస్టర్ అన్నది తెలిసిందే. రోజా నుంచి ఓకే బంగారం వరకు ఈ విషయాన్ని నిరూపించాయి. మళ్లీ ఇన్నేళ్ల తరువాత మణిరత్నం రొమాంటిక్ లవ్‌స్టోరీతో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. దీనికి సంబంధించిన వార్తలు గత కొన్ని రోజులుగా వినిపిస్తున్నాయి. అయితే సినీ లవర్స్, మణిరత్నం అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని తాజాగా అఫీషియల్‌గా ప్రకటించారు. భారీ స్థాయిలో తెరపైకి రానున్న ఈ మూవీని కోలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థగా పేరు తెచ్చుకున్న లైకా ప్రొడక్షన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మంగా తెరపైకి తీసుకు రాబోతోంది. మద్రాస్ టాకీస్ సహ భాగస్వామిగా వ్యహరిస్తోంది. ఈ బ్యానర్ కిది 23వ సినిమా. విలక్షణ నటనకు పెట్టింది పేరు విజయ్ సేతుపతి. ఇందులో కథానాయకుడిగా నటిస్తున్నారు. మణిరత్నంతో ఆయనకిది రెండవ సినిమా. ఇంతకు ముందు చెక్క చివంత వానంలో నటించారు. దీన్నే తెలుగులో నవాబ్ పేరుతో డబ్బింగ్ చేసి రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న సినిమా ఇది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సాయి పల్లవి నటిస్తోంది. రామాయణతో పాటు పలు భారీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉన్న సాయి పల్లవికి మణిరత్నంతో ఇది మొదటి సినిమా కావడం గమనార్హం. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా రెహమాన్ స్థానంలో యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్‌ని మ్యూజిక్ డైరెక్టర్‌గా తీసుకుంటారని ప్రచారం జరిగింది. అయితే ఆ పుకార్లకు చెక్ పెడుతూ టీమ్ రెహమాన్ ఈ మూవీకి మ్యూజిక్ చేస్తారంటూ క్లారిటీ ఇచ్చేసింది. మణిరత్నం మార్కు రొమాంటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూలై నుంచి ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో నటించే కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల వివారాల్ని టీమ్ త్వరలోనే వెల్లడించనుంది. సాయి పల్లవి లాంటి నటితో ఫస్ట్ టైమ్ వర్క్ చేస్తున్న మణిరత్నం తనని ఎలా ప్రజెంట్ చేస్తాడు? అనే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. గత సినిమాల్లో హీరో క్యారెక్టర్‌తో పాటు హీరోయిన్ పాత్రకు ప్రాధాన్యతనిచ్చే మణిరత్నం ఈ రొమాంటిక్ డ్రామాలో నేచురల్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న సాయి పల్లవిని ఎలా ప్రజెంట్ చేస్తాడు?..తన క్యారెక్టర్‌ని ఎలా డిజైన్ చేయబోతున్నాడు? అన్నది అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతే కాకుండా వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ ఉన్న సాయి పల్లవి ..మణిరత్నం ప్రాజెక్ట్‌కు డేట్స్ కేయించిందంటే సర్‌ప్రైజింగ్ ఎలామెంట్ ఏదో ఉంటుందని కూడా అందరూ చర్చించుకుంటున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి డిటైల్స్‌ని లైకా ప్రొడక్షన్స్ వర్గాలు వెల్లడించే అవకాశం ఉంది.


# తేజ మరో ఇంట్రెస్టింగ్ స్టెప్.. వరల్డ్ ఫేమస్ షోకు హోస్ట్‌గా..



టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా కెరీర్‌లో ప్రస్తుతం గోల్డెన్ ఫేజ్‌లో దూసుకెళ్తున్నారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస విజయాలతో పాటు చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టులు ఆయనకు మరింత పాజిటివ్ ఎలిమెంట్‌గా మారగా.. ఇప్పుడు కొత్తగా మరో ఇంట్రెస్టింగ్ స్టెప్ వేస్తున్నారు. సినిమాలతో బిజీగా ఉన్న తేజ సజ్జా, ఇప్పుడు ఓటీటీ వరల్డ్ లోకి హోస్ట్‌గా అడుగు పెడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న రియాలిటీ షో ది ట్రయిటర్స్ తెలుగు వెర్షన్‌కు తేజ హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఆ విషయాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో ముంబైలో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో అధికారికంగా ప్రకటించింది.

సైకాలజికల్ గేమ్ ప్లే, థ్రిల్లింగ్ ట్విస్టులతో ఫేమస్ అయిన ఆ షోను తెలుగు ప్రేక్షకుల కోసం కూడా తీసుకు రావడం విశేషం. ఇలాంటి గ్లోబల్ ఫార్మాట్ షోకు టాలీవుడ్ యంగ్ హీరోను హోస్ట్‌గా ఎంపిక చేయడం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇది తేజ సజ్జా కెరీర్‌లో కొత్త ఛాప్టర్ మొదలైనట్లే. సినిమాలతో పాటు కొత్త అవకాశాలను అందుకోవడంలో ఆయన చూపిస్తున్న డేరింగ్, ప్లానింగ్ సూపర్‌గా అనే చెప్పాలి. ప్రస్తుతం ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారగా.. అనేక మంది సినీ ప్రియులు తేజకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. అదే సమయంలో తేజ జర్నీ కూడా గుర్తు చేసుకుంటున్నారు. ఎందుకంటే చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్‌ను స్టార్ట్ చేసిన ఆయన.. చిన్న గ్యాప్ తీసుకుని క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రీ ఎంట్రీ ఇచ్చారు. అలా కొన్ని సినిమాలు చేశాక.. హీరో అయిపోయారు. హీరో అవ్వడమే కాకుండా.. పాన్ ఇండియాలో గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు వరల్డ్ ఫేమస్ షోకు హోస్ట్‌గా సందడి చేయనున్నారు. ఇక తేజ సజ్జా అప్ కమింగ్ మూవీస్ విషయానికొస్తే.. ఆయన లైనప్ చాలా ఆసక్తికరంగా ఉందని చెప్పాలి. టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన తొలి తెలుగు జాంబీ చిత్రం జాంబీ రెడ్డికి సీక్వెల్‌గా జాంబీ రెడ్డి 2 చేయనున్నారు. ఆ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుండగా, 2027 జనవరిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఆ చిత్రాన్ని నిర్మిస్తోంది. గతేడాది మంచి విజయం సాధించిన తేజ నటించిన మిరాయ్ సినిమాకు కూడా సీక్వెల్ సిద్ధమవుతోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆగస్టులో ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశముంది. అలాగే ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో ప్రాజెక్ట్ జై హనుమాన్‌లో కూడా నటించనున్నారు. ఏదేమైనా తేజ సజ్జా కెరీర్ ప్లానింగ్ చాలా స్ట్రాటజిక్ గా సాగుతోంది. సినిమాలు, ఓటీటీ షోలు రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతున్న ఆయన.. మరింత క్రేజ్ సంపాదించుకోవడం పక్కా అనే చెప్పాలి.

# శోభన్ బాబు పట్టుబట్టడంతో కురుక్షేత్రం వర్సెస్ డీవీఎస్ కర్ణ



ఇప్పటికి దాదాపు యాభై ఏళ్ళ క్రితం 1977 జనవరి 14న ఒకే డేట్ న అటు ఎన్టీఆర్ దాన వీర శూర కర్ణ, ఇటు సూపర్ స్టార్ క్రిష్ణ నట భూషణుడు శోభన్ బాబు మల్టీస్టారర్ కురుక్షేత్రం రిలీజ్ అయి తెలుగు నాట సినీ యుద్ధానికి దారి తీశాయి. ఈ యుద్ధం చాలా ఉత్కంఠగా సాగింది. విజేతగా దాన వీర శూర కర్ణ నిలిచినా టెక్నికల్ పరంగా కురుక్షేత్రానికి మంచి పేరు వచ్చింది. ఆ రోజులలో ఏ మాత్రం ఖర్చుకు వెనకాడకుండా క్రిష్ణ ఈ మూవీని నిర్మించారు. ఇక కర్ణుడు పాత్రలో రెబెల్ స్టార్ కృష్ణంరాజు అదిరిపోయే పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ మూవీలో ఆనాటి సినీ రంగానికి చెందిన వారు అంతా ఉన్నారు. అప్పట్లోనే మద్రాస్ నుంచి రాజస్థాన్‌కి 80 వేల రూపాయలతో ప్రత్యేక రైలుని వేసి మొత్తం ఆర్టిస్టులను తీసుకుని కురుక్షేత్రం క్లైమాక్స్ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించారు అన్నది గొప్పగా చెప్పుకున్నారు.

పోటీ పడాలనుకోలేదు : ఇదిలా ఉంటే 2022 లో దివంగతులైన క్రిష్ణ అంతకుముందు వివిధ టీవీ చానళ్ళకు తన కురుక్షేత్రం మూవీ గురించి వివరిస్తూ అనేక విషయాలు పంచుకున్నారు. తాను ఈ సినిమా తీయలేదని ఏ ఎస్ ఆర్ ఆంజనేయులు అనే నిర్మాత వచ్చారని క్రిష్ణ చెప్పారు. అంతకు ముందే శోభన్ బాబుని క్రిష్ణ పాత్రకు ఆయన తీసుకున్నారు, అర్జునుడి వేషానికి నన్ను అడిగారు అని క్రిష్ణ చెప్పారు. ఓకే అని తాను చెప్పాను అని క్రిష్ణ అన్నారు. ఇంతలో ఎన్టీఆర్ నుంచి కృష్ణకు కబురు వచ్చింది. దాన వీర శూర కర్ణ మూవీ తాను తీస్తున్నాను అని కురుక్షేత్రం మూవీ కథ కూడా అదే కావడంతో ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఎన్టీఆర్ క్రిష్ణను కోరారట. దానికి సరేనన్న క్రిష్ణ నిర్మాత ఆంజనేయులుతో ఈ సంగతి చెప్పారు, అయితే క్రిష్ణ పాత్రధారిగా అంగీకరించిన శోభన్‌బాబు మాత్రం తాను ఈ మూవీ చేస్తానని గట్టిగా పట్టుబట్టారని క్రిష్ణ చెప్పుకొచ్చారు. చేసేది లేక సినిమా తీయాలని ముందుకు సాగామని క్రిష్ణ చెప్పారు.

నిర్మాతగా మారాల్సి వచ్చింది : ఇక ఈ సినిమా నాలుగు రీళ్ళు పూర్తి చేశాక నిర్మాత ఆంజనేయులు ఆర్థిక ఇబ్బందులతో ఉండడంతో తాను నిర్మాతగా మారి మొత్తం సినిమా తీయాల్సి వచ్చింది అని క్రిష్ణ చెప్పారు. అలా ఈ సినిమా తీసి దాన వీర శూర కర్ణ మీద పోటీ పెట్టాలని తాను అనుకోలేదని పరిస్థితులు అలా వచ్చాయని క్రిష్ణ చెప్పారు. అయినా తమ సినిమాకు తెలుగు నాట తప్పించి మిగిలిన దక్షిణ భారత దేశంలో అంతటా మంచి పేరు వచ్చిందని అన్నారు.

అక్కడే మైనస్ అని : ఇక తెలుగు నాట రాయబార పద్యాలకు ఎంతో పాపులర్ అని ఆ పద్యాల రైట్స్ అన్నీ ఎన్టీఆర్ వద్ద ఉన్నాయని వాటిని దాన వీర శూర కర్ణలో వాడారని, అందుకే ఆ సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చిందని క్రిష్ణ చెప్పారు. తమ సినిమాకు కొత్తగా పద్యాలు రాయించి పాడించినా అది జనాలకు పెద్దగా ఎక్కలేదని అన్నారు. ఏది ఏమైనా కురుక్షేత్రం మంచి ప్రయోగంగా క్రిష్ణ ఆనాటి ఇంటర్వ్యూలలో చెప్పుకొచ్చారు ఇక ఈ మూవీలో కృష్ణుడుగా పూర్తి స్థాయి పాత్ర వేసిన శోభన్ బాబు తన కోరిక తీర్చుకున్నారు. ఆయన అంతకు ముందు బుద్ధిమంతుడు మూవీలో కొంత సేపు క్రిష్ణ పాత్రలో కనిపిస్తారు. ఎన్టీఆర్ తరువాత పౌరాణిక పాత్రలకు న్యాయం చేసిన ఆర్టిస్టులలో శోభన్ బాబునే ముందు చెప్పుకుంటారు. మార్చి 20న శోభన్ బాబు వర్ధంతి సందర్భంగా ఆయన గురించి అభిమానులు తలచుకుంటూ పాత విషయాలను మననం చేసుకుంటున్నారు.

# పెద్ది.. ఫ్యాన్స్‌కి టెన్షన్, మేకర్స్‌కు ప్రెషర్..




సినీ ఇండస్ట్రీలో ఇటీవల ఒక స్పష్టమైన ట్రెండ్ కనిపిస్తోంది. రిలీజ్ డేట్లు ముందే అనౌన్స్ చేసి, ఆఖరి నిమిషంలో వాయిదా వేయడం. భారీ బడ్జెట్ సినిమాలే కాకుండా మిడ్‌రేంజ్ ప్రాజెక్ట్స్ కూడా ఇదే బాట పట్టడం ట్రేడ్ వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమాపై కూడా ఇలాంటి పుకార్లు రావడం సహజంగానే ఫ్యాన్స్‌లో టెన్షన్‌ను పెంచింది.

**మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కి వాయిదా పడ్డ పెద్ది**

ముందుగా మార్చి 27న విడుదల కావాల్సిన ఈ సినిమా, కొన్ని కారణాల వల్ల ఏప్రిల్ 30కి వాయిదా పడింది. అయితే ఇప్పుడు మళ్లీ మే లేదా జూన్‌కు షిఫ్ట్ అవుతుందన్న వార్తలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవ్వడం, ఇండస్ట్రీలో నెలకొన్న ఈ పోస్ట్‌పోన్ కల్చర్ ప్రభావమేనని విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో కూడా అనేక సినిమాలు ఇదే విధంగా చివరి దశలో డేట్లు మార్చుకోవడం చూసిన ప్రేక్షకులు, పెద్ది విషయంలో కూడా అదే జరుగుతుందేమోనన్న అనుమానంతో ఉన్నారు.

**టార్గెట్ మిస్ అయ్యేదేలే!**

కానీ యూనిట్ నుంచి వస్తున్న సమాచారం మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏప్రిల్ 30 రిలీజ్‌ను మిస్ కాకూడదనే పట్టుదలతో టీమ్ పని చేస్తోందని తెలుస్తోంది. బ్యాలన్స్ షూటింగ్‌ను డే, నైట్ షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తున్నారు. ఒక స్పెషల్ సాంగ్ మినహా మెయిన్ షూటింగ్ మొత్తం దాదాపు ముగింపు దశకు చేరుకున్నట్టు సమాచారం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా సమాంతరంగా జెట్ స్పీడ్‌లో కొనసాగుతున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఇప్పటికే ఫస్ట్ హాఫ్ రీ రికార్డింగ్ ను పూర్తి చేయగా, రంజాన్ తరువాత సెకండాఫ్‌పై వర్క్ చేయనున్నట్టు సమాచారం.

**పెద్దిపై భారీ అంచనాలు**

ఇది మొత్తం చూస్తే, ఓవైపు ఇండస్ట్రీలో పెరుగుతున్న వాయిదాల ట్రెండ్, మరోవైపు పెద్ది టీమ్‌పై ఉన్న భారీ ఒత్తిడి.. ఈ రెండింటి మధ్య సమతౌల్యం సాధించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. భారీ బిజినెస్, సినిమాపై పెరిగిన అంచనాలు, డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఉన్న ప్రెషర్.. అన్నీ కలిసి పెద్ది సినిమాను టైమ్‌లైన్ విషయంలో మరింత కఠినంగా మార్చాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ వంటి బ్యానర్లు కూడా సినీ నిర్మాణంలో భాగస్వామ్యం అవడం వల్ల ప్లానింగ్‌లో ఎలాంటి లోపం లేకుండా ముందుకు తీసుకెళ్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.ఇక ఫ్యాన్స్ విషయానికి వస్తే.. సోషల్ మీడియాలో ప్రతి చిన్న అప్‌డేట్‌నే పెద్ద చర్చగా మార్చే పరిస్థితి ఉంది. వాయిదా పుకార్లు వస్తే వెంటనే ఆందోళన, రిలీజ్ క్లారిటీ వస్తే ఉపశమనం..ఇలా ఎమోషన్స్ ఊచకోత కొనసాగుతోంది. ఇప్పటికే పెద్ది నుంచి వచ్చిన రెండు సాంగ్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోవడంతో, మూడో సాంగ్ కోసం మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పెద్ది మూవీ ఈ పుకార్లను అధిగమించి అనౌన్స్ చేసిన డేట్‌కే రిలీజైతే, అది కేవలం ఒక సినిమా సక్సెస్ మాత్రమే కాదు.. ప్రస్తుత ఇండస్ట్రీ ట్రెండ్‌కు ఒక బలమైన సమాధానంగా నిలుస్తుంది.

# విక్రమ సింహపురి వర్సిటీలో 'ఇనాగురల్ టాక్': విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన నిపుణులు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఇనాగురల్ టాక్' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజిస్ట్రార్ కె.సునీత విశిష్ట అతిథిగా పాల్గొని ఈ సదస్సును ప్రారంభించారు.

**క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి మార్గం: వీసీ అల్లం శ్రీనివాసరావు**

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు క్రమశిక్షణతో కూడిన అధ్యయనాన్ని అలవరుచుకోవాలని సూచించారు. సమయాన్ని సమర్థంగా వినియోగించుకుంటూ, సరైన మార్గదర్శకత్వంలో పట్టుదలతో కృషి చేస్తే ఎలాంటి కఠినమైన పరీక్షలనైనా సులువుగా అధిగమించవచ్చని ఆయన ఆకాంక్షించారు.

**స్పష్టమైన ప్రణాళికతోనే సక్సెస్: ఆర్.ఏ. పద్మనాభరావు**

ముఖ్య వక్తగా విచ్చేసిన దూరదర్శన్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, అనంత ఐఏఎస్ అకాడమీ సీఈఓ ఆర్.ఏ. పద్మనాభరావు మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కేవలం చదవడం మాత్రమే సరిపోదని, విశ్లేషణాత్మక దృష్టి, సమకాలీన అంశాలపై పట్టు అవసరమని పేర్కొన్నారు.

లక్ష్యం: స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.

ప్రణాళిక: క్రమబద్ధమైన ప్రణాళిక రూపొందించుకోవాలి.

సాధన: నిరంతర సాధన మరియు స్వీయ విశ్వాసం కలిగి ఉండాలి.

విద్యార్థులకు వర్సిటీ అండ : రిజిస్ట్రార్ మరియు డైరెక్టర్

రిజిస్ట్రార్ కె.సునీత మాట్లాడుతూ, సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పూర్తి స్థాయి శిక్షణ మరియు మార్గనిర్దేశం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కేంద్రం డైరెక్టర్ జె. విజేత మాట్లాడుతూ, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు, మాక్ టెస్టులు మరియు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముగింపులో ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం కల్పిస్తున్న ఈ వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్య టి వీరారెడ్డి, డా యం.హుస్సేనయ్య, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఘనంగా ఇఫ్తార్ విందు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గం 12వ డివిజన్, చింత రెడ్డిపాళెంలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం నందు నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నెల్లూరు రూరల్ నియోజకవర్గ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ...పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని పేర్కొన్నారు. మైనారిటీ సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలి

## - అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్పష్టీకరణ




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారులు మరియు భవన నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అటవీ మరియు ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ నుండి ఉన్న అభ్యంతరాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే కాలంలో నిర్మించబోయే రహదారులకు సంబంధించి ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేసి, సర్వే సమయంలోనే అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను డివిజన్ మరియు పనుల వారీగా విశ్లేషించి, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా అటవీ అధికారి జి.ఏ.పి.ప్రసూన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఐటీడీఏ అధికారులు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అటవీ క్షేత్ర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న పత్సమట్ల ధర్మరాజు



**ఏలూరు జిల్లా, (రాజధాని వార్తలు):** ఉంగుటూరు నియోజకవర్గం ఉంగుటూరు మండలంలో పరాభవ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉంగుటూరు మండలం ఉంగుటూరు గ్రామంలోని వెంచేసియున్నా శ్రీ చల్లాలమ్మా తల్లి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించిన ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఈ సందర్భంగా గ్రామంలో పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఏఎంసి చైర్మన్, మాజీ ఏఎంసి చైర్మన్, గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ కూటమి పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారానికి ఎస్ఐ రాజశేఖర్ ఎంపిక

## - సాహసోపేత సేవలకు రాష్ట్ర ప్రభుత్వ గౌరవం



**రాపూరు, (రాజధాని వార్తలు):** రాపూరు మండలం సిద్దవరం గ్రామానికి చెందిన సబ్ ఇన్స్పెక్టర్ పాలెపు రాజశేఖర్‌కు రాష్ట్ర ప్రభుత్వంనుంచి గౌరవప్రదమైన గుర్తింపు లభించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిష్ఠాత్మక "కఠిన సేవా పథకం"కు ఆయన ఎంపికైనట్లు మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చేమూరు మస్తాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మరియు తిరుపతి జిల్లా ఇంచార్జి గొర్రిపాటి పీరయ్య, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పందల భాస్కర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2018 బ్యాచ్‌కు చెందిన రాజశేఖర్ తన ఎనిమిదేళ్ల సేవా కాలంలో పోలీసు శాఖలో కీలక విభాగాల్లో పనిచేస్తూ విశేష ప్రతిభ కనబర్చారు. ముఖ్యంగా మావోయిస్టు కార్యకలాపాలను అణచివేసే గ్రేహౌండ్స్ దళంలో, ఉగ్రవాద నిరోధక చర్యలకు ప్రసిద్ధి చెందిన ఆక్టోపస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ సాహసోపేతంగా సేవలందించారు. ప్రస్తుతం ఉగ్రవాద కార్యకలాపాలను సమర్థవంతంగా ఛేదిస్తూ తన సేవా నైపుణ్యంతో అంచెలంచెలుగా ఎదుగుతున్న రాజశేఖర్‌కు ఈ గుర్తింపు రావడం జిల్లాకు గర్వకారణమని మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జిల్లా కమిటీ ల బాధ్యతలు పేర్కొన్నారు. కఠిన పరిస్థితుల్లోనూ ధైర్యసాహసాలతో విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రభుత్వం అందించే ఈ పురస్కారం ఆయన కృషికి నిదర్శనమని అన్నారు. రాజశేఖర్‌కు ఈ గౌరవం లభించడంపై స్థానికులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# వివిధ హోదాలలో పనిచేసి మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు అందజేత


**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ రోడ్డు రవాణా సంస్థలో వివిధ హోదాలలో పనిచేసి మరణించిన వారి కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కలెక్టర్ కార్యాలయములోని వారి ఛాంబరులో కారుణ్య నియామక పత్రాలు అందచేసారు. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో కండక్టరుగా విధులు నిర్వహిస్తూ మరణించిన బి.శ్రీనివాసరావు వారి కుమారుడు బి.అభినవ్‌ను వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అందచేసారు. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో ఎలాక్ట్రిషియాన్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన యస్.డి.ఖాదర్ బాషా, వారి కుమార్తె యస్.డి. రేష్మిను వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అందచేసారు. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో పర్యవేక్షకునిగా విధులు నిర్వహిస్తూ మరణించిన పెంచలయ్య, వారి కుమారుడు ఐ.కృష్ణకు వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అందచేసారు. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన జి.పెంచలయ్య, వారి కుమారుడు జి.నవీన్‌కు వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అందచేసారు. ఎ.పి.యస్.ఆర్.టి.సిలో డ్రైవర్‌గా



విధులు నిర్వహిస్తూ మరణించిన యస్.కె.మొహ్వామ్మద్ రసూల్, వారి కుమారుడు యస్.కే.మహమ్మద్ రఫికు వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా సాంఘీక సంక్షేమ శాఖలో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అందచేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విదుల పట్ల అంకిత భావంతో పనిచేయడం తోపాటు పై అధికారుల ఆదేశాలను విధిగా అమలు చేస్తూ ఆయా శాఖలకు మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని తెలియ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# బుచ్చిరెడ్డిపాళెంలో ఘనంగా 'దివ్యాంగ శక్తి' కార్యక్రమం



**బుచ్చిరెడ్డిపాళెం, (రాజధాని వార్తలు):** 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇకపై పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'జీరో ఫేర్' టికెట్ల ద్వారా ఉచిత ప్రయాణం. దివ్యాంగుల పెన్షన్ 3 వేల నుంచి 6 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో కోవూరు నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో 'దివ్యాంగ శక్తి' కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచనల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇకపై పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 'జీరో ఫేర్' టికెట్ల ద్వారా ఉచిత ప్రయాణం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని వారు వెల్లడించారు. గతంలో టీడీపీ హయాంలో దివ్యాంగులకు 2 లక్షల నుండి 4 లక్షల వరకు రాయితీ రుణాలు అందించి ఆర్థిక భరోసా కల్పించామని, ఇప్పుడు పెన్షన్‌ను 3 వేల నుండి 6 వేలకు పెంచిన ఘనత కూడా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని స్పష్టం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం పరిసర ప్రాంతాల దివ్యాంగులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో కోవూరు



నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజలను



ఆదుకుంటున్న తెలుగుదేశం మరియు కూటమి పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని వారు ఆకాంక్షించారు

# తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 195 ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం చేసిన ముఠా గుట్టురట్టు - 55 కేసులు ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు

**- సుమారు 4 లక్షల విలువ గల 400 కేజీల రాగి వైర్లతో పాటు, నేరానికి ఉపయోగించిన రెండు ఆటో లు, రెండు మోటార్ సైకిల్ తో పాటు రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం - రాగి వైర్ల దొంగతనం కోసం వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకున్న దొంగల ముఠా - ఏడాది కాలం పాటు దొంగతనాలు చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగల ముఠా - రైతులకు నష్టం కలిగించే చర్యల పైన ఉపేక్షించే ప్రసక్తే లేదు, అరెస్ట్ కాబడిన ముద్దాయిల పైన పీడీ యాక్ట్ నమోదు - 15 నుండి 20 వేల రూపాయల విలువ చేసే కాపర్ వైర్ కోసం 2.5 లక్షల విలువైన ట్రాన్స్ ఫార్మర్లను పగులగొట్టి రైతులకు నష్టం కలిగిస్తున్న దొంగలు - ఒక వైపు పంట నష్టం మరో వైపు కొత్త ట్రాన్స్ ఫార్మర్ల అమర్చడంలో ఆలస్యంతో రైతులకు ఇబ్బందులు - రైతుల సమస్యలను ప్రత్యేక దృష్టితో తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఐపీఎస్. - క్రైమ్ అదనపు యస్పీ, శ్రీనివాసులు మరియు నాయుడుపేట డియస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు - పక్కా ప్రణాళికతో ఎక్కడా అరెస్ట్ కానీ, పోలీస్ రికార్డులలో లేని 5 గురు అంతర జిల్లా దొంగల అరెస్ట్**


**- దొంగలించిన రాగి వైర్లను కొన్న ఒక కొనుగోలు దారుడు కూడా అరెస్ట్, భవిష్యత్తులో ఎవరైనా దొంగ సొత్తు కొన్నట్లైతే చట్టపరమైన చర్యలు : జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, ఐపీఎస్.**





**తిరుపతి జిల్లా, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లాలో జరుగుతున్న వ్యవసాయ పొలాలలోని ట్రాన్స్ ఫార్మర్‌లను లక్ష్యంగా చేసుకొని, అందులోని రాగి వైర్లను దొంగతనం చేస్తూ, రైతులు పడుతున్న ఇబ్బందులు మరియు నమోదు అయిన కేసులపై జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగింది. తిరుపతి జిల్లా క్రైమ్ అదనపు యస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నాయుడు పేట డియస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో వెంకటగిరి ఇన్స్పెక్టర్ రమణ, బాలయ్యపల్లి, డక్కిలి యస్.ఐలు గోపి మరియు శివ శంకర్ రావు మరియు సిబ్బందితో వివిధ బృందాలు ఏర్పాటు చేసి, వివిధ కోణాలలో దర్యాప్తు చేయడం జరిగింది. దర్యాప్తులో భాగంగా రాబడిన సమాచారం మేరకు బాలయ్యపల్లి మండలం లోని జయంపు క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేయబడిన బృందం ఆటోలో కొంతమంది జయంపు నుండి గొల్లపల్లి వైపుగా వెళు తుండగా అనుమానంతో అందులో ఉన్న 5 గురిని పట్టుకొని విచారించగా వారి వద్ద దొంగతనంకి ఉపయోగించిన పరికరాలు, వివిధ నేరాలలో దొంగతనం చేసిన రాగి వైర్‌ను స్వాధీనం చేసుకొని, వారిని విచారించి వారి వద్ద రాగి వైర్‌ని దొంగ సొత్తు అని తెలిసి కొన్న మనుబోలుకి చెందిన రాఘవ అనే వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగింది. వారిని విచారించగా వారు ఇప్పటి వరకు ఎక్కడా అరెస్ట్ కానట్లు, వారు నెల్లూరు మరియు తిరుపతి జిల్లాల్లో సుమారు 195 ట్రాన్స్ ఫార్మర్ లలో దొంగతనం చేసినట్లు గుర్తించడం జరిగింది. రెండు జిల్లాల్లోనూ రికార్డులు పరిశీ లించగా వారి చెప్పిన నేర ఒప్పుకోలుని బట్టి క్రింద కనబరచిన 5 గురు ముద్దాయిలు తిరుపతి జిల్లాలో నాయుడుపేట సబ్–డివిజన్‌లో 23 కేసులు, పుత్తూరు సబ్–డివిజన్‌లో 11 కేసులు, శ్రీకాళహస్తి సబ్–డివిజన్‌లో 8 కేసులు, రేణిగుంట సబ్–డివిజ న్‌లో 2 కేసులు మరియు చంద్రగిరి సబ్–డివిజన్‌లో ఒక కేసులో (తిరుపతి జిల్లాలో మొత్తం 45 కేసులు) ముద్దాయిలు గాను మరియు నెల్లూరు జిల్లాలోని గూడూరు సబ్ –డివిజన్ లో 10 కేసులు మొత్తం 55 కేసులలో నేరాలు చేసినట్లు గుర్తించడం జరిగింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు నిమిత్తం ముద్దాయిలను పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించి తదుపరి దర్యాప్తు కొనసా గించడం జరుగుతుంది. ఈ కేసులను ఛేదించడంలో మరియు ముద్దాయిలను అరెస్ట్ చేసి సొత్తుని స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన క్రైమ్ ఆధనపు యస్పీ శ్రీనివాసులు, నాయుడుపేట డియస్పీ చెంచుబాబు, వెంకటగిరి ఇన్స్పెక్టర్ రమణ, బాలాయపల్లి ఎస్.ఐ కె. గోపిమరియు పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మురళి కృష్ణ, కానిస్టేబుల్ ఖాదర్ మస్తాన్, తిరుపాలు, శ్రీనివాసులు, అజయ్ బాబు మరియు హోమ్ గార్డులు శ్రీహరి మరియు శీనయ్యలను జిల్లా ఎస్పీ ప్రశంసించడం జరి గింది మరియు సిబ్బందికి రివార్డులు అందజేయడం జరిగింది.

అరెస్ట్ కాబడిన ముద్దాయిలు: దొంగతనాలకు పాల్పడిన వారు: 1. బండి వాసు తండ్రి : మునెయ్య, వయస్సు :22 సం.రాలు, 2. బూదూరు మణి తండ్రి : రామ సుబ్బయ్య, వయస్సు: 27 సం. రాలు, 3. కత్తి పోలయ్య తండ్రి :వెంకటేశ్వర్లు, వయస్సు: 40 సం. రాలు, 4. పురేటి చందు తండ్రి : శీనయ్య, వయస్సు: 25 సం.రాలు, 5. ఏకోలు మధు తండ్రి : లేట్ పోలయ్య, వయస్సు: 32సం. రాలు, గొల్లపల్లి గ్రామం, గూడూరు రూరల్ మండలం, ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లా. దొంగ సొత్తు కొన్న వ్యక్తి: – 6. చల్లా రాఘవ తండ్రి : రాఘవులు, వయస్సు : 44 సం. రాలు, యాచవరం గ్రామం, మనుబోలు మండలం, ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీలు వెంకటరావు (పరిపాలన) రవి మనోహర్ ఆచారి (శాంతి భద్రతలు) శ్రీనివాసులు (క్రైమ్స్) వెంకటగిరి డిఎస్పి చెంచు బాబు మరియు సిఐలు సిబ్బంది పాల్గొన్నారు.



## కావూరు సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ దూలం నాగేశ్వరరావు

**కైకలూరు, (రాజధాని వార్తలు):** ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కైకలూరు మాజీ ఎంఎల్ఏ దూలం నాగేశ్వరరావు, మాజీ కేంద్ర మంత్రివర్యులు కావూరు సాంబశివరావు 11–03–2026 బుధవారం స్వర్గస్తులు కాగా, ఈరోజు ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వారి స్వగృహమునకు వెళ్లి వారి కుమారులు భాస్కర్‌ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కావూరు సాంబశివరావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

# నారాయణ నేత్ర జ్యోతి ద్వారా పేదల కళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యం

**- ప్రతి గడపకూ కార్పొరేట్ వైద్యం.. మంత్రి పొంగూరు నారాయణ దిశానిర్దేశంలో ఉచిత వైద్య శిబిరం - మూలాపేటలో ముమ్మరంగా 'నారాయణ నేత్ర జ్యోతి' - ఉచిత వైద్యం.. క్షేత్రస్థాయి పర్యవేక్షణ..40వ డివిజన్‌లో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పర్యటన**

# పినపళ్ళలో ఉచిత పశువైద్య శిబిరం

**ఆలమూరు, (రాజధాని వార్తలు):** మండలంలోని పినపళ్ళ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆలమూరు వారి ఆధ్వర్యంలో బుధవా రం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆలమూరు మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ అనిత అధ్యక్షతన ఈ పశు వైద్య శిబిరాన్ని ఆలమూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి దుర్గారావు అధ్వర్యంలో పినపళ్ళ గ్రామ సర్పంచ్ సంగీత శుభాష్, మాజీ ఏఎంసీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఎంపిటిసి పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య, వైస్ చైర్మన్ కేతా రాంబాబు, కొత్తూరి సాయి, జనసేన నాయకులు కొత్తపల్లి నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రెండు పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా మొదటిది నర్శిపూడి గ్రామంలో దిగ్విజ యంగా పూర్తి అయ్యిందని, రెండోవది పినపళ్ళ గ్రామంలో ఏర్పాటు చేసామని ఆమె తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో డాక్టర్ బి సుభాష్ చంద్ర సమక్షంలో 50 మంది పశు పోషకులు తీసుకు వచ్చిన 79 పశువులకు వైద్య సేవలను అందజేసారు. వాటిలో



35 పశువులకు ఆరోగ్య గర్భకోశ పరీక్షలు నిర్వహించగా మిగిలిన 34 పశువులకు నట్టల నివారణ నిర్వహించి పశు ఆరోగ్య నిమిత్తం మెరుగైన పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లును, ప్రతి ఒక్క పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యనమదల రాణి శ్రీనివాస్, నామాల సుబ్బారావు,జంగం రామారావు, మార్కెట్ కార్యదర్శి వి పైడేశ్వరావు పశు వైద్య శాఖా,మార్కెట్ కమిటీ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మున్సిపల్ శాఖామాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ దిశానిర్దేశంలో, నెల్లూరు నగర నియో జకవర్గంలోని ప్రతి గడపకూ కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు ముమ్మరంగా సాగు తున్నాయి. ఈ క్రమంలో మూలాపేటలోని 40వ డివిజన్‌లో కొండదిబ్బ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'నారాయణ నేత్ర జ్యోతి' మరియు ఉచిత దంత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను స్వయంగా పర్యవేక్షించారు... ఈ సందర్భంగా రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ గడచిన 10 రోజుల్లోనే 1,100 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి, సుమారు 586 మందికి ఉ చితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం విశేషం. శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన 39 మందికి సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్లు పూర్తి చేసి, తిరిగి సురక్షితంగా ఇంటి వద్ద దించి మందులను కూడా అందజేశారు. పేదవారి కళ్లలో వెలుగులు నింపడమే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమం, నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ మరియు



ప్రతి వీధికి చేరుకుంటుందని డిప్యూటీ మేయర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు..ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ అధ్యక్షుడు గండవరపు నాని, వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజేశ్వరి, యూనిటీ ఇంచార్జి మురళి, కో క్లస్టర్ ఇంచార్జ్ సుమంత్ కుమార్ స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం఼ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురామ నాయుడు



**తాడేపల్లిగూడెం టౌన్, (రాజధాని వార్తలు):** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డు బిలాల్ మసీదులో ఇఫ్తార్ విందు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ ముస్లింల పవిత్ర మాసం రంజాన్ అని తెలిపారు. ఎంతో నియమనిష్టలతో ఈ మాసాన్ని ముస్లిం సోదరులు పాటిస్తారన్నారు. ముస్లిం సోదరులు తమకున్న దానిలో పరులకు సాయం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదర భావంతో వెలసిల్లుతారన్నారు. ప్రపంచ శాంతికి రంజాన్ మాసం ఒక ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో షేక్ హాజీ, షేక్ రెహమాన్, రోల్డ్ గోల్డ్ అక్బర్, కొరియర్ అక్బర్, షాయద్ అలీ, మునీర్, వార్డు ఇంచార్జ్ లు కలిశెట్టి తాతరావు,ఋడి ప్రసాద్ ,పట్నాల గణపతి, ద్వారంపూడి కిరణ్ రెడ్డి,అశోక్ కుమార్ గారు,తనేటి అజయ్, లంక రాజశేఖర్ ,వైఎస్ఆర్ సీపీ నాయకులు వింజమూరి శ్రీనివాస్ , అంజి రెడ్డి,ఎలిపే గాంధీ,మార్లమూడి సుబ్బారావు, గోపి జానీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆనందపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది సంబరాలు





**ఆనందపురం, (రాజధాని వార్తలు):** ఆనందపురం ప్రెస్ క్లబ్ (ఆనంద పురం మండల పాత్రికేయుల సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో గురువారం ఆనందపురం కూడలి (వేములవలస)లో గల ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర గంటల పంచాంగంతో పాటు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డబ్బీరు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆనందపురం మండలంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు తరువాత మొదటగా తెలుగు సంవత్సరాది వేడుకలను జరుపు కోవడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారానికి సాయి శక్తులా చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శి దొంతల చిన శ్రీను మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉంటూ కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలన్నారు. కోశాధికారి రౌతు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు జర్నలిస్టులు వారధిలా పనిచేస్తున్నారన్నారు. సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎరుకొండ అప్పలరాజు, కార్యదర్శి దళాయి శివ, సహాయ కార్యదర్శి బోనెల గురువులు, మెంబర్ లు మతికాన నారాయణరావు, పాండ్రంకి ప్రసాద్, తూర్పాటి నరసింహామూర్తి, ఉప్పాడ నవీన్, వెన్ని అప్పలరాజు, బంక శంకర్రావు, ముడసల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబిక జాతరలో కట్టుదిట్టమైన బందోబస్తు - సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణ

**ఆలమూరు, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర తీర్థ మహోత్సవం సందర్భంగా భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణం లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సీఐ విద్యాసాగర్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో పోలీసులు నిరంతరం పహారా కాస్తూ భక్తులకు భద్రత కల్పిస్తున్నారు.మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ, భక్తుల రాకపోకలను సజావుగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు



గమనించిన వెంటనే చర్యలు తీసుకునేలా పోలీసులు అప్రమత్తం గా ఉన్నారు. అనంతరం సీఐ విద్యాసాగర్ అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# దివ్యాంగుల ఉచిత బస్సు సర్వీస్ ప్రారంభం - పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సూపర్-6 హామీలలో భాగంగా ప్రకటించిన ఉచిత బస్ సర్వీస్ను కూటమి ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే రాజప్ప పేర్కొన్నారు. బుధవారం పెద్దాపురం పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్ సర్వీస్ పథకంను ఎమ్మెల్యే రాజప్ప, కాకినాడ జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మరియు ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగులతో పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం,



కూటమి నాయకులు, పెద్దాపురం ఎంపిడిఓ కె.వి. సూర్యనారాయణ, సామర్లకోట ఎంపిడిఓ కె.సామ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan